క్లుప్తంగా

ఇండోర్ జిమ్‌కు స్థల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ఇండోర్ జిమ్ ఏర్పాటుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ శుక్రవారం మూడు ప్రాంతాల్లో స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా న్యూటౌన్‌లోని ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్, తూర్పుకమాన్‌కు ఎదురుగా ఉన్న మోడ్రన్ రైతుబజార్, రామయ్యబౌలిలో పర్యటించారు. ఈయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

రోగాలపై అప్రమత్తంగా ఉండాలి



గండేడ్: వర్షాలు వరుసగా పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు రోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఆయుర్వేదిక్ డాక్టర్ శిల్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులకు వండిన భోజనం పరిశీలించారు. నిబంధనల మేరకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా తాజా కూరగాయాలు వంటలు వండుతున్నారా లేదా అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ యాదమ్మ, రేణుక, ఆశ వర్కర్లు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయొద్దు

భూత్పూర్: తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎంతో నమ్మకంతో కష్టపడి చదివిస్తున్నారని.. వారి ఆశయాలను వమ్ము చేయరాదని ప్రముఖ సైకాలజిస్టు రాధాకృష్ణారావు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు, పదవులు అనుభవిస్తూ చదువు నేర్పిన గురువుల పట్ల క్రమశిక్షణ, విలువలు గ్రహించి కళాశాల, గ్రామం, తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తీసుకురాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్, అధ్యాపక బృందం ఉన్నారు.

కృష్ణాజలాలతో అభిషేకం




చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని గంగాభవానీ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రెండురోజులపాటు జరిగిన ఉత్సవాల్లో శుక్రవారం ఉదయం ఆలయంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముదిరాజు సంఘం నాయకులు కృష్ణాజలాలను తీసుకురాగా.. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. మేళతాళాలు, కోలాటాలు, భజన కీర్తనలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌తోపాటు పలువురు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఆదివాసీ హక్కులను కాపాడాలి

నవాబుపేట: ఆదివాసీ హక్కులను కాపాడాలని కగార్ హత్యాకాండను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం వేదిక జిల్లా కన్వీనర్ వెంకటయ్య మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ఆదివాసీలను వివిధ రకాల సర్చింగ్ నిరాశ్రయులను చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం కగార్ పేరుతో అడవులను నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలను కాలరాస్తుందని వీటిని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఈనెల 24న వరంగల్‌లో జరిగే సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సీ-డివిజన్ వన్డేలో జిల్లా క్రీడాకారుడి ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సి-డివిజన్ వన్డే చాంపియన్‌షిప్‌లో జిల్లాకేంద్రానికి చెందిన ఎండీ అద్నానుద్దీన్ మెరుగైన ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్ వండర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అద్నానుద్దీన్ బ్యాటింగ్‌లో రాణించాడు. రంగారెడ్డి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 44 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 403 పరుగులు చేసింది. జిల్లా క్రీడాకారుడు అద్నానుద్దీన్ 47 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు కొట్టి 79 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ వండర్స్ జట్టు విజయం సాధించింది.

ప్రజాసంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



కర్వెన బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



గండేడ్‌లో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

● జిల్లాలో ముమ్మరంగా పనుల జాతర

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తువ్వగడ్డ తండా, ఫతేపూర్‌లో ఉపాధి నిధులు రూ.20లక్షల చొప్పున నిర్మించిన జీపీ భవనాలు, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.25లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కొత్తగా వేసిన బోరు మోటార్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కరుణశ్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

అడ్డాకుల/చిన్నచింతకుంట: ప్రజాపాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ నిరాధారమైన, అసత్య ఆరోపణలు మానుకుని బాధ్యతగల నాయకుడిగా వ్యవహరించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. మూసాపేట మండలంలోని తాళ్లగడ్డకు వెళ్లేదారిలో రూ.1.25లక్షలతో నిర్మించిన హైలెవల్ వంతెనను శుక్రవారం ప్రారంభించారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా అడ్డాకుల ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ఉపాధి హామీలో మంజూరైన స్వయం ఉపాధికికి సంబంధించిన మంజూరు పత్రాలు, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చిన్నచింతకుంట మండలం పర్దిపూరంలో జీపీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీహరి, శెట్టిశేఖర్, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, రామన్‌గౌడ్, కృష్ణయ్య, బాలనర్సింహులు, ఎన్టీగౌడ్, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేయని అభివృద్ధి పనులు 18నెలల్లో చేసి చూపించామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూత్పూర్ శివారు నుంచి కర్వెన వరకు ఎంఆర్‌ఆర్ 2024–25 నిధుల నుంచి రూ.4.50కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు పనుకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 19పనులకు సంబంధించి ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్‌నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కమీషనర్ నూరుల్ నజీబ్, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీవో శ్రీదేవి, నాయకులు తదితరులు ఉన్నారు.

మిడ్జిల్ మండలంలో..

మిడ్జిల్: మండల కేంద్రంలోపి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులను జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్, తహసీల్దార్ యాపీరాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్, ఏపీఓ హైమావతి, కార్యదర్శి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర మండలంలో..

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో శుక్రవారం సీసీరోడ్డు పనులకు మండల ప్రత్యేక అధికారి బాలమణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య భూమిపూజ చేసి ప్రారంభించారు. అలాగే నార్లోనికుంట్లలో వివిధ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకట్రాములు, రాఘవులు, రాజేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవాబుపేట మండలంలో..

నవాబుపేట: మండల కేంద్రంలో రూ.70లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం ప్రారంభించారు. శుక్రవారం ఒక్కరోజే మండలంలో రూ.4కోట్ల పనులు ప్రారంభించినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ ఉన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

గండేడ్/మహమ్మదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పనుల జాతరలో భాగంగా మండల కేంద్రంలో మహిళా సంఘాలకు రూ.9.5కోట్ల చెక్కును అందజేశారు. అలాగే గండేడ్, వెన్నాచేడ్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కప్లాపూర్, సాలార్‌నగర్‌లో రూ.40లక్షలతో నిర్మించిన రెండు జీపీ భవనాలు, జానంపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, చిన్నవార్వాల్, రుసుంపల్లిలో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లమ్మ, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండలంలో..

మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్‌లో రూ.70వేలతో నిర్మించిన పశువుల షెడ్డు, అనంతరం ముందలితండాలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, షేక్‌పల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే మహిళా సంఘాలకు రూ.6.79కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ శారద, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగిన క్యూలైన్లు



నవాబుపేట సహకార సంఘం కార్యాలయంలో క్యూలైన్లు

నవాబుపేట: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడంలేదు. మండల కేంద్రంలో యూరియా కోసం శుక్రవారం సైతం క్యూలైన్లు కొనసాగాయి. యూరియా ప్రైవేట్ దుఖానాల్లో అందుబాటులో లేకపోవడంతో పీఏసీఎస్‌లోని యూరియా కేంద్రంలో రైతులు బారులుదీరారు. రెండు రోజులుగా 760 బస్తాల యూరియాను రైతులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

యూరియా కొరతను నివారించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: యూరియా కొరతను నివారించి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సహాయ కార్యదర్శి రాము, సీహెచ్ రాంచందర్ డిమాండ్ చేశారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం టీఎన్జీవోస్ భవనంలో సభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆగస్టు 25, 26 తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, మొదటి రోజు ఇండస్ట్రియల్ ఏరియా నుంచి బాలుర కళాశాల వరకు ర్యాలీ అనంతరం టీటీడీ కల్యాణ మండపం ఎదుట బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈనెల 26న సుదర్శన్ ఫంక్షన్ హాల్లో ప్రతినిధుల సభను హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతాంగం, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, వెంకటేశ్, అరుణ్ కుమార్, రామకృష్ణ, సీతారాం, హాజీ మల్లన్, వెంకట్రాములు, దాసు, మన్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

నవాబుపేట: శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా మండలకేంద్రంలోని నీలకంఠస్వామి ఆలయంలో కుర్వినిశెట్టి సంఘం ఆధ్వర్యంలో శ్రావణ హోమాలు నిర్వహించారు. సామూహిక హోమంలో 51జంటలు పాల్గొన్నాయి. అనంతరం చిన్మయనందస్వామి పీఠాధిపతి నందీశ్వరస్వామికి పాదాభిషేకాలు, ప్రత్యేక సన్మాన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నయ్య, స్వామి, చంద్రశేఖర్, నరేశ్, శ్రీనివాస్, బాల్‌రాజ్, శశిధర్, కుమార్, పండారినాథ్, చంద్రకళ, లావణ్య, శ్రీగౌరి తదితరులు ఉన్నారు.

బంద్ విజయవంతం

మిడ్జిల్: మార్వాడీ వ్యాపారులు గోబ్యాక్ అంటూ ఓయూ జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం మండల కేంద్రంలో వ్యాపార సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. బంద్ సందర్భంగా హోటల్స్, దుకాణాలు, మూసి ఉంచారు. అనంతరం వ్యాపారులు మార్వాడీ గోబ్యాక్ అంటు నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ యూపీ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యాపారులు కృష్ణ, యాదగిరి, జహంగీర్, రాజేశ్వర్, శ్రీనువాసులు, శేఖర్, భాస్కర్, జహీర్, శ్రీను, ఆంజనేయులు, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జడ్చర్ల: స్థానిక బ్రహ్మకుమారీస్ రాజయోగ సేవాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలకు బీవీపీ సభ్యులు జైపాల్ మూడు స్టాండ్ ఫ్యాన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో బీవీపీ పాలమూరుశాఖ అధ్యక్షుడు భూషణ్‌పాండే, ఉపాధ్యక్షులు వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి వెంకటేశ్వరగుప్తా, హెచ్‌ఎం ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తాం

నవాబుపేట: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వసతులపై ఆరాతీశారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఈఓ నాగ్యానాయక్, సీఆర్‌పీ జనార్దన్, హెచ్‌ఎం మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

గండేడ్: మండలంలోని కొంరెడ్డిపల్లికి చెందిన వీఆర్‌ఏ సంపల్లి వెంకటయ్య(58) అనారోగ్యంతో మృతిచెందాడు. కొంతకాలంగా గండేడ్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మృతిచెందగా.. తహసీల్దార్ మల్లికార్జున్‌రావు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్‌ఐ యాసిన్, జూనియర్ అసిస్టెంట్లు రాంచంద్రం య్య, సత్యయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.

చెత్తవేసిన వారికి నోటీసులు ఇవ్వండి



జడ్చర్ల టౌన్: 167వ నెంబరు జాతీయ రహదారి పక్కన బాదేపల్లి శివారులో చెత్తను వెంటనే తొలగించాలని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం చెత్త పారేసిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. రోడ్డు పక్కన వేసిన చెత్తను పరిశీలించి వెంటనే తీసివేయించాలన్నారు. అలాగే చెత్త వేసిన వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

చవితి ఉత్సవాలకు సహకరించాలి

భూత్పూర్: వినాయక చవితి ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని, ప్రశాంత వాతావరణంలో గణనాథుల నిమజ్జనం నిర్వహించేలా చూడాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ-2 శివశంకర్, పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



నవాబుపేట: విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి కోరారు. శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై కలెక్టర్‌తోపాటు విద్యుత్ ఎస్‌ఈ నవీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, విద్యుత్ అధికారులకున కలిసిన వారిలో బీకేఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాములు, రఘునందన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వరప్ప, భీమయ్య, గణపతి, వేణుగోపాలు తదితరులు పాల్గొన్నారు.

'దొంగ ఓట్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు'

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో దొంగ ఓట్ల నమోదు ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద గొడ్డలిపెట్టు అని తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కై లక్షలాది బోగస్ ఓటర్లను సృష్టించిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అనేక సాక్ష్యాధారాలను నిరూపించారని తెలిపారు. దేశ ప్రజల విశ్వసనీయత నిలబెట్టే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రై డేను పాటించాలి



గండేడ్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ డ్రై డేను పాటించాలని మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మన్సూర్‌పల్లి పర్యటించి వీధుల్లో తిరుగుతూ సూచనలు, సలహాలు చేశారు. ప్రజలు పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ గోపాల్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: మండలంలో వానకాలంలో సీజనల్ వ్యాధులబారిన ప్రజలు పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సంయుక్తంగా గ్రామంలో శుక్రవారం డ్రై, డే నిర్వహించారు. ఇంటి ఆవరణలో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, దోమల లార్వాలను పెంచకుండా పూలకుండీలు, నీళ్లతొట్టీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రసాద్, సునంద, వైద్య సిబ్బంది గీతా, జంగయ్య, దేవయ్య, సంపత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



అడ్డాకుల: అడ్డాకుల మండలంలోని కందూర్, మూసాపేట మండలంలోని సంకలమద్దిలో పోచమ్మ బోనాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు కొత్త కుండల్లో బోనాలను అలంకరించుకుని గ్రామంలో ఊరేగింపుగా ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బంగారు మైసమ్మకు బోనం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యనగర్ బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం బోనాలను వైభవంగా జరుపుకొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాదేపల్లి రంజిత్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాల అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు సామాజిక తనిఖీ

దేవరకద్ర: ఉపాధి హామీ పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయం అవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఏపిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు చేసిన పనులకు సంబంధించి ప్రజావేదికలో నివేదికలను చదివి వినిపిస్తారని తెలిపారు. గ్రామాలవారీగా చేసిన పనులపై జిల్లా అధికారుల సమక్షంలో సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

రాజాబహదూర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం



గ్రీన్‌బెల్ట్‌లోని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

మెట్టుగడ్డ: రాజా బహదూర్ వెంకటరామరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రాజాబహదూర్ వెంకట్రామరెడ్డి జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతీకాలనీ గ్రీన్‌బెల్ట్‌లోని రాజాబహదూర్ వెంకట్రామరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎలాంటి వసతులు లేని సమయంలోనే హైదరాబాద్‌లో కులమతాలకు అతీతంగా హాస్టల్ నిర్మించి పేదవిద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారని, మహిళలు చదువుకుంటే సమాజం బాగుపడుతుందని భావించి, వందేళ్ల క్రితమే రెడ్డి మహిళా కళాశాల ఏర్పాటు చేసిన మహనీయుడని గుర్తుచేశారు. ఆయన ప్రేరణతో మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన రెడ్డిహాస్టల్‌లో ఇప్పుడు ఐఐఐటీ కళాశాల తాత్కాలిక భవనంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి, పాలమూరు రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, ధనుంజయరెడ్డి, ఉదయశ్రీ, సురేందర్‌రెడ్డి, మనో హర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతి, శోభ, కవిత, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాలొన్నారు.

జీహెచ్‌ఎంకు సన్మానం

గండేడ్: వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంను టీఎస్ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం సన్మానించారు. కోయిల్‌కొండ మండల కేంద్రంలో పనిచేస్తున్న రవిబాబు జీహెచ్‌ఎంగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విధుల్లో చేరగా.. టీఎస్ యూటీఫ్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఫ్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు గోవిందు, కోశాధికారి వెంకటయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జున్, రమేశ్, శ్రీనివాస్, హనుమంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జేఏసీ సమావేశం

గండేడ్: వికారాబాద్ జిల్లా సాధనకు ఈనెల 24న ఆదివారం ఉదయం 10 గంటలకు పల్లవి ఆడిటోరియంలో జేఏసీ సమావేశం ఏర్పాటు చేసినట్లు సాధన సమితి జేఏసీ ఒక ప్రకటనలో తెలిపింది.

హామీలు నెరవేర్చి సమర్థత నిరూపించుకోవాలి

జడ్చర్ల టౌన్: వచ్చిన అవకాశాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సద్వినియోగం చేసుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చి తన సమర్థత నిరూపించుకోవాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం బాదేపల్లి పెద్దగుట్టపై విలేకరులతో మాట్లాడారు. గురువారం రాజాపూర్ మండలంలో సీసీరోడ్ల శంకుస్థాపన సభలో తనను దద్దమ్మ, అసమర్థుడిగా పదేపదే వాఖ్యానించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తనపేరు ఎత్తనని పదేపదే మైకులో చెప్పిన ఎమ్మెల్యే ప్రతిసారి తనపై ఆరోపణలు చేస్తూ ట్రెండింగ్ కావాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నిలకు నెలరోజుల ముందు ముడా నిధులు వాడుకోడానికి తాను సంతకం పెట్టానని పదేపదే ఆరోపణలు చేయడం తగదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముడాను తీసుకొచ్చిన విషయాన్ని విస్మరించరాదని, రియల్‌వ్యాపారం కారణంగా నిధులు రూ.30కోట్లు జమ అయ్యాయన్నారు. ఎన్నికల ముందు ముడా నిధులను మహబూబ్‌నగర్‌కు తీసుకోమని సంతకం పెట్టినట్లుగా పదేపదే చెబుతున్నారని, తాను నిధులు పాలమూరుకు ఖర్చు చేసుకోమని ఉంటే చూపించాలన్నారు. మినిట్స్‌బుక్‌లో సంతకం పెట్టిన విషయం వాస్తవమేన్నారు. గెలిచిన కొద్ది రోజుల్లోనే రూ.10కోట్ల ముడా నిధులు తీసుకొచ్చానని ఎమ్మెల్యే ప్రకటించటాన్ని తప్పుబట్టారు. తమ హయాంలో జమైన రూ.30కోట్లల్లో రూ.10కోట్లు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో లేఅవుట్‌లు చేయడానికి ఎవరూ ముందుకురావడంలేదని, 19నెలల్లో కేవలం రూ.2నుంచి 3కోట్లు మాత్రమే ముడాకు సమకూరాయన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల టౌన్: పట్టణాలను పరిశుభ్రంగా.. పచ్చదనం వెల్లివిరిసేలా తీర్చిదిద్దే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కెంచలింగమ్మ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మున్సిపల్ యూనియన్ పట్టణ నాలుగో మహాసభలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల జీతాలను పెంచుతామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు పెంచి పర్మినెంట్ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన, పోరాటాల బాటలో పయనిస్తామన్నారు. అంతకు ముందు సిగ్నల్‌గడ్డ నుంచి ఫంక్షన్‌హాల్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి నర్సింహులు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నార్లోనికుంట్లలో డెంగీ వ్యాధి సోకిన వ్యక్తి ఇంటిని సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. డెంగీ సోకిన వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. వర్షాలు బాగా కురవడంతో పరిసరాల్లో నీరు నిలిచి దోమలు పెరిగే అవకాశం ఉందని.. దీని నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాల్లో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులబారిన పడిన వారికి పరీక్షలు చేయించి తగిన మందులను అందించాలని కోరారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం అందించే సమయంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి బాలమణి, వైద్యాధికారి శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.